విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

బుధవారం 18 సెప్టెంబరు 2024 8 పేజీలు

ఎంబిబిఎస్ విద్యార్థులకు...

విద్యను దూరం చేస్తున్న ఎన్డీఏ కూటమి

ఎన్ ఎం సి అనుమతులు ఇచ్చిన కళాశాలలో మౌలిక వసతులు కల్పించలేమని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటు

పోరాటాలకు విద్యార్థి సంఘాల సన్నిద్ధం - 107, 108 జీవోల రద్దుపై మౌనం

స్థానిక గంధమనేని శివయ్య భవన్ నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి చలపతి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఎంపీ మద్దెల గురుమూర్తి , ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు గుప్పెట్లోకి తీసుకెళ్లే ఆలోచనలు కనిపిస్తున్నాయని, గుజరాత్ తరహాగా పిపిపి (ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం) విధానానికి ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందన్నారు. ఇదే జరిగితే మొత్తం రిజర్వేషన్ల వ్యవస్థకు తూట్లు పడే ప్రమాదం ఉందన్నారు. వైద్య విద్య పూర్తిగా ప్రవేట్ పరంగా మారుతుందని హెచ్చరించారు.

వార్త మెయిన్‌లో

చిత్తూరు-తచ్చూరు ఎక్స్ ప్రెస్ హైవే కోసం భూములిచ్చిన రైతులకు

దారి చూపని వైనం

ఈజిప్టు పిరమిడ్లను తలపించేలా కొండలకబ్జా - సర్వీస్ రోడ్డు కోసం నేడు చిత్తూరులో ధర్నా

22 న వంటా-వార్పు - సిపీఐ జాతీయ నేత నారాయణ రాక

వార్త మెయిన్‌లో

చిత్తూరు- తచ్చూరు ఎక్స్ ప్రెస్ హైవే కోసం భూములు ఇచ్చిన రైతాంగానికి నోట్లో మట్టి కొట్టేందుకు కేంద్ర ఉపరితల రవాణా శాఖ యత్నిస్తోందని సిపిఐ, రైతు సంఘం నేతలు పేర్కొన్నారు. మంగళవారం నేషనల్ హైవే పక్కన రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను సిపిఐ, రైతు సంఘం ప్రతినిధి వర్గం పర్యటించి రైతుల బాధలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కరూర్, పాదిరి, బూచానత్తం, అయినంబాకం, కాళికాపురం, దామరపాకం గ్రామాలకు చెందిన రైతాంగం మాట్లాడుతూ సిపిఐ ,రైతు సంఘం సహకారంతో తమ భూములకు పరిహారం ఎకరాకు ?8 లక్షల నుండి ?16లక్షలకు పెంచు కోగలిగామని పేర్కొన్నారు.

(విశాలాంధ్ర-తొట్టంబేడు) 'వెలుగు' కుంభకోణంలో నమ్మలేని నిజాలు వెలుగు చూస్తున్నాయి. ఈ ఆర్థిక లావాదేవీల్లో బ్యాంకర్లకూ వాటా ఉందనే ఆరోపణలు వస్తున్నాయి. చియ్యవరం లావాదేవీలతో ఎన్నో వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. పొదుపు మహిళల బ్యాంకు రుణాలు చెల్లించుకునేప్పుడు బ్యాంకర్లు కనీస నియమాలు పాటించాల్సి ఉంటుంది. ఆ నియమాలేవీ పట్టించుకోకుండా, కనీసం డబ్బు ఓచర్ కూడా తీసుకోకుండా సంఘమిత్రల చేతికి రిసీవింగ్ రిసిప్ట్ ను ఇవ్వడం చూస్తుంటే బ్యాంకర్ల పాత్రపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.

వెలుగు కుంభకోణంలో...

నమ్మలేని నిజాలు

- ఆర్థిక నేరాల్లో బ్యాంకర్లకూ వాటా..?
- చియ్యవరం లావాదేవీలతో వెలుగులోకి



2

ప్రతి ఒక్కరు...

మొక్కలు నాటండి

ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కండి

- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు

- వార్త 2 లో

2లో

శ్రీవారి భక్తులకు

రుచికరమైన ఆహారాన్ని అందించాలి

- హోటళ్ల నిర్వాహకుల అవగాహన కార్యక్రమంలో టీటీడీ ఈవో

నమ్మలేని నిజాలు

(మొదటి పేజీ తరువాయి) తొట్టంబేడు మండలం చియ్యవరం 'వెలుగు' కుంభకోణంలో సంఘమిత్రల పాత్ర ఎంతుందో.... అంతకుమించి ఓ బ్యాంకు అధికారుల నిర్లక్ష్యం కూడా అంతే ఉందని తెలుస్తోంది. సాధారణంగా వెలుగు శాఖ ద్వారా పొదుపు సంఘాలకు బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి, ఉన్నతి, వీవో రుణాలు అందిస్తూ ఉంటారు. వీటిలో బ్యాంకు రుణాలు మాత్రం సదరు బ్యాంకు నుంచి నేరుగా పొదుపు సంఘాల సభ్యుల ఖాతాలకు వెళుతుంది. తక్కిన మూడు రకాల రుణాలు వివిధ రూపాల్లో సంఘ సభ్యులకు చేరుతాయి. అయితే చియ్యవరంలో 51 పొదుపు సంఘాలు ఉండగా 70 శాతం రుణాలు ఓ బ్యాంకు ద్వారా ఇచ్చినవే అధికం. గత ఆరేళ్లలో సంఘమిత్రలు పక్కదారి పట్టించిన రూ.1.81 కోట్ల డబ్బుల్లో అధిక భాగం ఈ బ్యాంక్ నుంచి పొందినవే. అయితే గడువుల్లోగా ఈ బ్యాంకుకు చేరాల్సిన రూ.1.81 కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టినప్పుడు ఆ బ్యాంకు అధికారులు ఎందుకు పరిశీలించలేదన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా బ్యాంకుల నుంచి రుణాలు పొందుతున్న పొదుపు సంఘాలు సక్రమంగా అప్పు చెల్లించకుంటే సదరు బ్యాంకు అధికారులు 90 రోజులకు ఒకసారి ఆయా గ్రూపుల స్థితిగతులపై వెలుగు అధికారులకు మెమో పంపి సమీక్ష చేస్తుంటారు. మరి ఈ బ్యాంక్ నుంచి ఈ ఆరేళ్లలో ఎందుకు ఒక్క మెమో కూడా వెలుగు కార్యాలయానికి వెళ్లలేదన్నది అసలు ప్రశ్న. ఇదిలా ఉంటే పొదుపు సంఘాలకు తామిచ్చిన రుణం మొత్తం తీరితేనే కొత్త రుణం మంజూరు చేసేందుకు బ్యాంకర్లు సుము ఖత వ్యక్తం చేస్తుంటారు. దానికి కూడా సవాలక్ష నిబంధనలు పెడుతుంటారు. అయితే చియ్యవరంలో దాదాపు 47 గ్రూపు నుంచి సక్రమంగా బ్యాంకుకు అప్పు జమ కాకున్నా ఈ బ్యాంకు కొత్త రుణాలు ఎలా ఇవ్వారనేది అసలైన ప్రశ్న. సంఘమిత్రలతో కొందరు బ్యాంకు అధికారులు కుమ్మక్కై విధివిధానాలను, నిబంధనలను తుంగలో తొక్కి చేతివా టం ప్రదర్శించారనడానికి ఇదో ఉదాహరణ. అంతేకాకుండా 2022లో చేమూరు గ్రామానికి చెందిన చేమూరు అమ్మ అనే గ్రూపు నుంచి రోశమ్మ అనే గ్రూపు సభ్యురాలి ఖాతా నుంచి ఆమె కుమారుడు గురవయ్యకు రూ.33 వేలు ఆ సంఘం తీర్మానం లేకుం డా బదిలీ చేసింది. చియ్యవరం భాగ్యలక్ష్మి గ్రూపులో 19-03-24న రూ.7 వేలు అప్పు కట్టినట్లు బ్యాంకు స్టేట్మెంట్ లో ఉండగా... రసీదులో మాత్రం రూ. 72 వేలుగా ఉంది. కానీ ఆ రసీదులో కట్టిన తేదీ 16 అని ఉండగా సీలు మాత్రం 19 అని ఉంది. కౌంటర్ ఓచర్‌ను బ్యాంకు అధికారులు సమాచారం నింపకుండానే ఇచ్చేయడం కొసమెరుపు.

రసీదులతో మోసం...: చియ్యవరంలో సంఘమిత్రలు మునిలక్ష్మి, మునిశేఖర్ లు పొదుపు మహిళలను నమ్మకమనే ఆయుధంతో.. రసీదులనే ఆధారాలతో నిలువునా ముంచేశారని జరిగిన సంఘటన చెబుతోంది. వీరిలో మునిలక్ష్మి సంఘమిత్రే కాదు, బ్యాంకు మిత్ర కూడా. ఆమె ప్రతిభను నమ్మి ఈ బ్యాంకు వారు బ్యాంకు కరస్పాండెంటు ఉద్యోగం కూడా ఇచ్చి ఆర్థిక లావాదేవీల మిషన్ ని కూడా ఆమె చేతిలో పెట్టింది. అదే ఆమెకు వరంగా మారగా... పొదుపు మహిళలకు శాపంగా మారింది. సభ్యులు నేరుగా బ్యాంకుకు వెళ్లి అప్పు చెల్లించాల్సింది బదులు బ్యాంకు మిత్ర అయిన సంఘమిత్ర చేతికి ఇవ్వడంతో అవినీతికి దారులు పడ్డాయి. మరో సంఘమిత్ర కూడా ఆమె బాటలోనే నడవడంతో మహిళలందరూ నమ్మకంగా వారి వద్దే డబ్బు కట్టడం ప్రారంభించారు. ఇక్కడే వాళ్లు చేతివాటాన్ని ప్రదర్శిస్తూ డబ్బు రసీదులను తారుమారు చేయడం... డబ్బు కట్టకున్నా రసీదులు తీసుకొచ్చి సభ్యుల చేతికి ఇవ్వడం చేశారు.

ఇక రుణాల విషయానికి వస్తే.. ఒక గ్రూపు రెండేళ్ల కాలపరిమితితో రూ. 10 లక్షలు రుణం తీసుకుంటే, ఆ మొత్తాన్ని వడ్డీతో సహా గడువుల్లోగా చెల్లించాల్సి ఉంటుంది. అప్పుడే కొత్త రుణం ఇస్తారు. అయితే చియ్యవరంలో పొదుపు సంఘాలు బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలకు అప్పు మొత్తం కట్టేసినా అధికారికంగా మాత్రం బ్యాంకులో రుణం అలానే ఉంటుంది. కానీ సంఘమిత్రలు సగం రుణమే చెల్లించి, ఆ చెల్లించిన అప్పు **మేరకే తిరిగి రుణాలు ఇప్పిస్తూ...** బ్యాంకు వారు ఇంతే ఇచ్చారని నమ్మబలికేవారు. ఇదేంటి మేము కట్టింది రూ.10 లక్షలు కదా? అంటూ ఏదైనా గ్రూప్ నుంచి ప్రశ్న ఎదురైతే ముని లక్ష్మి బ్యాంకు కరస్పాండెంట్ ఖాతా నుంచి తక్కిన మొత్తాన్ని అందజేసే వారు. బ్యాంకు సీళ్లు సైతం వారి వద్దే ఉంచుకుని మహిళలను మోసం చేసినట్టుగా తెలుస్తోంది. చియ్యవరం సంఘటనపై జిల్లా కలెక్టర్ ఉన్నత స్థాయి విచారణకు ఆదేశిస్తే అసలు దొంగలెవరో బయటపడే అవకాశం ఉంది. ఈ బ్యాంకుపై వస్తున్న ఆరోపణలపై సదరు బ్యాంకు మేనేజర్ ను వివరణ కోరగా తాను ఆసుపత్రిలో ఉన్నానంటూ మాటదాటు వేయడం గమనార్హం.

మొక్కలు నాటండి

విశాలాంధ్ర– చిత్తూరు : ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, పచ్చదనాన్ని పెంచేందుకు, మొక్కలు నాటాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు పిలుపునిచ్చారు. భారత ప్రధాని నరేంద్ర మోడీజీ పుట్టినరోజును పురస్కరించుకొని, మంగళవారం యాదమరి మండలం సమీపంలోని మహాసముద్రం జాతీయ రహదారి పరిసర ప్రాంతాలలో మొక్కల నాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్ర మానికి, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద రావు ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలను నాటారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆధునిక పోకడలు ప్రకృతి వినాశనానికి దారితీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు రోజుకి పచ్చదనం తగ్గిపోవడంతో కాలుష్యం అధికం అవుతుంది. చాస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. మానవుని మనుగడకు అవసరమైన ప్రాణవాయు నందించే చెట్ల పెంపకాన్ని కూడా ఆధునిక మానవుడు నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచానికి ప్రమాదకారిణిగా తయారైన కాలుష్య నియంత్రణకు, పచ్చదనాన్ని పెంచడమే సరైన మార్గమన్నారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి ప్రకృతి పరిరక్షణకు నడుం బిగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ కటారి హేమలత, ఎక్స్ ఎమ్మెల్సీ దొరబాబు, మాజీ మేయర్ హేమలత . పిడి కార్తీక్ రెడ్డి, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి పరిశుభ్రత అందరి బాధ్యత

- పరిసరాల శుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం : ఎమ్మెల్యే ఆరణి
- నగరాన్ని శుభ్రంగా ఉంచుదాం: ఎమ్మెల్సీ సిపాయి
- పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన : కమిషనర్ మౌర్య

విశాలాంధ్ర – తిరుపతి సిటీ: పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మహతి ఆడిటోరియం నుంచి తారకరామ స్టేడియం వరకు నిర్వహించిన ర్యాలీని వారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన తిరుపతిని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. వ్యక్తిగత శుభ్రత ఎంత ముఖ్యమో పరిసరాల పరిశుభ్రత అంతే ముఖ్యమని అన్నారు. నగరంలో అపరిశుభ్రతకు ఏ ఒక్కరూ తావు ఇవ్వకూడదు అన్నారు. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన గొప్ప పథకం స్వచ్ఛ భారత్ అన్నారు. మోదీ స్ఫూర్తితో రాష్ట్రంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అమలు చేస్తున్నారని అన్నారు. పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంత సమాజం సాధ్యమని అన్నారు. తిరుపతిని స్వచ్ఛతా హీ సేవలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. అందరూ కలిసికట్టుగా కృషి చేసి తిరుపతి నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకుందామన్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో ప్రతి ఒక్కరు నగరపాలక సంస్థ సిబ్బందికి సహకరించాలన్నారు. స్వచ్ఛ భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని అన్నారు. తిరుపతి పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. కమిషనర్ ఎన్.మౌర్య మాట్లాడుతూ.. స్వచ్ఛత హీ సేవలో భాగంగా నగరంలో పారిశుధ్యం పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. రెండు వారాలు పాటు ఈ కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. నగరంలోని ప్రతి ఒక్కరు తమ ఇల్లు, హాస్పిటల్స్, కార్యాలయాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. చెత్త ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తే నగరం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. ఈ స్వచ్ఛతా హీ సేవలో భాగంగా వేస్ట్ ఆర్ట్, వాల్ ఆర్ట్ పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. పారిశుధ్య కార్మికులకు హెల్త్ చెకప్ చేయిస్తున్నామని అన్నారు. నగరంలో ఖాళీ ప్రదేశాలని శుభ్రం చేసి మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. పరిశుభ్రత అనేది మున్సిపాలిటీ, ప్రభుత్వానిదే బాధ్యత కాదని, ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమా, రిజిస్ట్రార్ రజని, అడిషనల్ ఎస్పీ రవి మనోహారాచారి, జిల్లా వైద్యాధికారి శ్రీహరి, టూరిజం రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, సెట్విన్ సీఈఓ మురళీకృష్ణ, మునిసిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ యువ అన్వేష్, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు సేతుమాధవ్, కేఎల్ వర్మ, మేనేజర్ చిట్టిబాబు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

రుచికరమైన ఆహారాన్ని అందించాలి

విశాలాంధ్ర – తిరుమల కల్చరల్ : తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తుల ఆరోగ్య భద్రతకు టీటీడీ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని, అందుకే తిరుమలలోని హొటళ్ల వ్యాపారులకు ఆహార భద్రత విభాగంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఈవో జె శ్యామలరావు తెలిపారు.ఆస్థాన మండపంలో టీటీడీ ఆరోగ్య మరియు ఎస్టేట్స్ విభాగాలు ఆహార భద్రత విభాగం తో కలసి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఈవో ప్రసంగిస్తూ, తిరుమలకు విచ్చేసే భక్తుల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఉందన్నారు. అన్ని తినుబండారాల దుకాణాలు, ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు ఆహార భద్రతా చట్టాలను పాటించాలని, లేనిపక్షంలో ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని హొటల్ యజమా నులందరూ చక్కగా వినియోగించుకోవాలని ఈవో కోరారు. అంతకు ముందు ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ పూర్ణచంద్రరావు తిరుమలలోని రెస్టారెంట్లు మరియు తినుబండారాల యజమానులు పాటించాల్సిన పారిశుధ్య పద్ధతులు, చట్టాలు గురించి వివరించారు.టీటీడీ ఈవో చొరవతో తిరుమల హొటల్ యజమానులకు ఫోస్టాక్ (ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ అండ్ సర్టిఫికేషన్) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు ఆశాజ్యోతి, వెంకటేశ్వర్లు, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన ప్రసాద్, వివిస్వో సురేంద్ర, ఫోస్టాక్ ట్రైనర్ ఆంజనేయులు, తిరుమల ఆహార భద్రత విభాగం అధికారి జగదీష్, తిరుమలలోని వివిధ హొటళ్ళ ప్రతినిధులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణకై మందుల పంపిణీ

విశాలాంధ్ర – ఏర్పేడు : తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం యం డి పుత్తూరు గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల నందు సర్పంచ్ మోహనప్రియ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణకు మాత్రలు వేయడం జరిగినది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మనం ప్రతిరోజు భోజనానికి ముందు చేతులను శుభ్రపరచుకోవడం ద్వారా నులిపురుగులు నివారించుకోవటానికి ఒక మార్గమని మరియు ప్రతి ఒక విద్యార్థి ఆరునెలలకు ఒకసారి నులిపురుగుల నివారణ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి లోకముని యంఎల్‌హెచ్‌పి దివ్య ఏఎన్ఎమ్ లలిత ఆశావర్కర్ సునీత పాల్గొన్నారు.

ఈనెల 19 నుంచి మండల స్థాయి

క్రీడా పోటీలు

విశాలాంధ్ర – రామచంద్రాపురం: మండలంలోని నెత్తకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిం చనున్నట్లు ఎంఈఓ మార్కొండయ్య నాయుడు, జయవేలు తెలిపారు. మంగళ వారం విలేకరులతో వారు మాట్లాడుతూ మండల స్థాయి క్రీడా పోటీలు ఈనెల 19 నుంచి 20 వరకు నెత్త కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లోని అండర్-14, అండర్-17 కేటగిరీలకు చెందిన కబడ్డీ, కోకో, వాలీబాల్, చెస్, యోగ, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొననున్నట్లు తెలిపారు. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చంద్రగిరి నియోజ కవర్గస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వివరిం చారు. సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రుల డిక్లరేషన్తో పాల్గొనే అవకాశం ఉందని పేర్కొన్నారు. క్రీడాకా రులు వారి వెంట పాఠశాల నుంచి వయసు ధ్రువీకరణ పత్రాలను తీసుకుని రావాలని చెప్పారు. అర్హులైన క్రీడాకారులు స్పోర్ట్స్ యూనిఫామ్ తో పాటు పాఠశాల నుంచి వయస్సు ధ్రువీ కరణ పత్రాలతో హాజరుకా వాలని తెలియజే శారు. ఈ కార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ప్రధానో పాధ్యా యులుతులసికుమారి పాల్గొన్నారు.

టాటా ట్రస్ట్ వారి సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. వెంకటరత్నం ఆదేశాలతో రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ సహకా రంతో భవాని నగర్ క్లస్టర్ లోని మహిళలకు మంగళవారం ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో టాటా ట్రస్ట్ పిఆర్ఓ హేమంత్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మారి తర్వాత మనిషికి గుండె జబ్బులతో అధికంగా ఇబ్బంది పడుతున్నారన్నారు.ఈ మహమ్మారిని ఆదిలోనే గుర్తించ కపోతే ఎన్నో అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుంద న్నారు.క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకో వాలని కోరారు.అనంతరం రాస్ ఫీల్డ్ అధికారి కరుణాకర్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మనిషి పనిభారంతో యాంత్రి కుడులా మారి ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహిస్తున్నారని తద్వారా కుటుంబాన్ని ఇబ్బందిపాలు చేస్తున్నారని ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహిస్తే ముప్పు తప్పదని తెలియజేశారు.ఈ వైద్య శిబిరంలో 150 మంది మహిళలకు రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి అండ్ సి,నోటి క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్, గర్భా శయ క్యాన్సర్లకు సంబం ధించి పరీక్షలు ఉచితంగా నిర్వహిం చారు.ఈ కార్యక్రమంలో రాస్ సిబ్బంది,మంజుల,క్లస్టర్ లీడర్లు సుహాసిని,పుష్పాంజలి, రాధిక,శ్రీలక్ష్మి,విజయ,గిరిజ తదితరులు పాల్గొన్నారు.

నేడు తిరుమల శ్రీవారి ఆలయంలో పౌర్ణమి గరుడసేవ

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్: తిరుమల శ్రీవారి ఆలయంలో సెప్టెంబరు 18వ తేదీన పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. ప్రతినెలా పౌర్ణమి సందర్భంగా తిరుమలలో గరుడసేవ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. రాత్రి 7 నుండి రాత్రి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు సువర్ణకాంతులీనుతున్న గరుడునిపై తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు.

విద్యార్థులకు కూలింగ్ వాటర్ క్యాన్లు బహుకరణ

విశాలాంధ్ర - చిట్టమూరు : మండలంలోని అరవపాలెం గ్రామం నందు నల్లారెడ్డి బాలకృష్ణారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చల్లనిత్రాగునీరు అందించేందుకు యల్లసిరి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కాపులూరు చెంచురామయ్య పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు ఆములూరు ప్రభావతికి త్రాగునీటి క్యాన్లను అందజేశారు. ఈ సందర్భంగా చెంచురామయ్య మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులు భోజనం సమయంలో త్రాగేందుకు నీళ్లు చల్లగా లేనందున నానా అవస్థలు పడుతున్నారని తమ దృష్టికి రావడంతో 6000 రూపాయలు తమ సొంత నిధులతో ఖర్చు చేసి పిల్లలకు కూలింగ్ వాటర్ క్యాన్లను తెప్పించి పాఠశాల ప్రధానోపాధ్యాయురాల కి మంగళవారం పాఠశాల ఆవరణంలో అందజేయడం జరిగిందని విద్యార్థులు ఈ చల్లని నీరు వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని చెంచు రామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

తాసిల్దార్ కార్యాలయం వద్ద విద్యార్థుల ఆందోళన

విశాలాంధ్ర - చిట్టమూరు : తాసిల్దార్ కార్యాలయం వద్ద చిట్ట మూరు గణపర్తి మార్కండేయ నాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల విద్యార్థులు మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తాసిల్దార్ ఐ ఎస్ ప్రసాద్ తో మాట్లాడుతూ పాఠశాలలో సాలినంతమంది ఉపాధ్యాయులు లేనందున తమకు పాఠాలు బోధించలేకురన్నారని హిందీ బోధించే ఉపాధ్యాయులు గత కొంతకాలంగా పాఠశాలలో లేనందున ప్రతి ఏటా తాము హిందీ సబ్జెక్టు నందు మార్కులు తాము వెనకబడి పోతున్నామని తాసిల్దార్ చొరవ తీసుకొని అన్ని తరగతులకు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని విద్యార్థులు తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యలపై స్పందించిన తాసిల్దార్ వెంటనే పై అధికా రులకు తెలిపరిచి పాఠశాలలో అన్ని తరగతులకు ఉపాధ్యాయులు ఉండేటట్టు చూస్తామని తాసిల్దార్ తెలిపారు.అనంతరం విద్యార్థులు తమ ఆందోళన విరమించి పాఠశాలకు వెళ్లారు.

వరద బాధితులకు విరాళాలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విజయవాడ వరద బాధితులకు 25 వేల రూపాయలను గూడూరు రైతు బజార్ అసోసియేషన్ ఎమ్మెల్యే సునీల్ కుమార్ కు అందచేశారు. ఈ కార్యక్రమంలో రైతు బజార్ అధ్యక్షులు మనపాటి శ్రీనివాసులు , కార్యదర్శి జోగి శివకుమార్ , సుధ , మణి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరు పురపాలక పరిధిలోని చెన్నూరు ప్రాంతంలోని చేనేత సంఘం 50 వేల రూపాయలు , 20 వేల రూపాయలు విలువ చేసే చేనేత చీరలను ఎమ్మెల్యే సునీల్ కుమార్ కు మాజీ వైస్ ఎం.పి.పి మట్టం శ్రావణి అధ్వర్యంలో అందచేశారు. ఈ కార్యక్రమంలో చేనేత సభ్యులు , పాల్గొన్నారు.అదేవిధంగా శ్రీ స్వర్ణంధ్రా భారతి స్కూల్ విద్యార్థులు, ఉత్తరాంధ్ర మరియు విజయవాడ వరద భాదితుల సహాయర్ధం, గూడూరు నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీ పాశిం సునీల్ కుమార్ చేతులమీదుగా 65,420 రూపాయలను వరద భాధితుల నిధికి అందచేయడం జరిగింది.ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ, వరద బాధితులకు విద్యార్థులు చేయూత నందించడం అభినందనీ యం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండంట్ పెల్లేటి నవకోటి నాయుడు, సునీల్ రాజ్, హరికృష్ణ మరియు సింధు లతో పాటు అధ్యాపక బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి జన్మదినానికి పండ్లు, బిస్కెట్లు పంపిణీ

విశాలాంధ్ర - కార్వేటినగరం : దేశ ప్రధానమంత్రి నరేంద్ర దామోదర్ దాస్ మోడీ జన్మదిన పుష్కరించుకొని శ్రీ సరస్వతి శిశు మందిర్ విద్యార్థులకుచాక్లెట్లు, పండ్లు బిజెపి రాష్ట్ర నాయకులు నడింపల్లి యువరాజు, మండల పార్టీ అధ్యక్షులు రామిశెట్టి రాజశేఖర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు ప్రధానమంత్రి మోడీ గురించి క్లుప్తంగా వివరించారు. అదేవిధంగా కార్వేటి నగరం వృద్ధాశ్రమం నందు వృద్ధులకు పండ్లు బిస్కెట్లు విత రణ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కుమార్ రాజు,శాంతనవర్మ,రోశయ్య, శ్రీహరి, వృద్ధులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం అల్లుడి వేధింపులు

అల్లుడుపై మామ పోలీసులకు పిర్యాదు

విశాలాంధ్ర -బాలాయపల్లి : బాలాయపల్లి మండలం లోని మల్లెమాల గ్రామానికి చెందిన చెన్నూరు వెంకటసుబయ్య కుమార్తె చెన్నూరు శిరీష ను తుమ్మూరు గ్రామానికి చెందిన ఈరి గోపి అనే వ్యక్తి కి ఇచ్చి వివాహం చేశారు. అయితే అదనపు కట్నం తేవాలని తన కుమార్తె ను తరచూ తాగి వచ్చి కొట్టి చిత్ర హింసలకు గురి చేస్తున్నాడని ఈ క్రమంలో గత 4 సంవత్సరాలు కాలంగా తన కుమార్తె తమ ఇంటి వద్దే ఉంటూ ఓ ప్రవేట్ కంపెని లో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తుందన్నారు. మంగళవారం ఉదయం తన ఇంటిపైకి మారనాయిదాలు తో పూటుగా మద్యం తాగి వచ్చి గోపి తో పాటు ఈరి సుబ్బరామయ్య, ఈరి అమృత అనువారు తన కుమార్తే తో పాటు తనపై, తన భార్య పై దాడి చేసి గాయపరిచారని మంగళవారం బాలాయపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

రేపటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 19 నుంచి మూడు రోజుల పాటు మండల స్థాయి పాఠశాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారులు అంబటి బాలయ్య, భువనేశ్వరి తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఇందులో భాగంగా అండర్-14, అండర్-17 బాల, బాలికలకు వాలీబాల్, కబడ్డీ,యోగా, ఖో- ఖో, బాడ్మింటన్, చదరంగం, అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఇందు లో పాల్గొన వలసిన అండర్-14 క్రీడాకారులు 01.01.2011తరువాత... అండర్-17 క్రీడాకారులు 01.01.2008 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 19వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు శ్రీకాళహస్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హాజరు కావాలని వారు తెలిపారు. మరిన్ని వివరాలకు 9985667750 ఫోన్ నంబరులో సంప్రదించాలని వారు కోరారు.

నేడు జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక - జిల్లా సెక్రటరీ వేణుగోపాల్

విశాలాంధ్ర - రామకుప్పం : జిల్లా జూనియర్ బాల, బాలికల షూటింగ్ బాల్ జట్టును నేడు బుధవారం ఎంపిక చేయనున్నట్లు చిత్తూరు జిల్లా షూటింగ్ బాల్ సెక్రటరీ వేణుగోపాల్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ని మేజర్ గ్రామ పంచాయతీ కి చెందిన మిట్టపల్లి సమీపంలో ని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాల మైదానంలో నేడు ఉదయం 9 గంటల నుంచి జట్ల ఎంపిక జరుగుతుందని ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు మరియు జనన ధ్రువీకరణ పత్రం తో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు తీసుకొని రావాలన్నారు క్రీడాకారులు 1.4.2005 తరువాత పుట్టిన వారై ఉండాలని ఆయన కోరారు అదేవిధంగా ఏదైనా వివరాలుకు 6301831236 నెంబరు కు సంప్రదించాలని ఆయన కోరారు

బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు

విశాలాంధ్ర - కార్వేటి నగరం : కార్వేటి నగరంలోనే గ్రామ దేవత అయిన శ్రీ బంగారం ఆలయంలో మంగళవారం ఉదయం అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల నుండి ఆలయం వద్ద పొంగల్ లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కే ప్రసాద్, ఉపాధ్యక్షులు రంగనాథ మొదలియార్, కార్యదర్శి చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1.50 లక్షలు విరాళం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఎస్‌టిసెల్ అధ్యక్షులు ఎం.దారునాయక్ ఆధ్వర్యంలో సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1.50 లక్షలు విరాళంగా అందిం చారు. మంగళవారం ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడుని కలిసి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వారికీ సహాయార్థంగా ఈ విరాళంను అందించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు విజయవాడలో ముంపునకు గురైన ప్రాంతాల ప్రజలను ఆదుకునేందుకు గాను శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జల. వెంకటసుధీర్ రెడ్డి ఆదేశాలమేరకు రాష్ట యస్.టి. సెల్ అధ్యక్షులు ఎం.దారు నాయక్ అధ్వర్యంలో సి.ఎం రిలీఫ్ ఫండ్‌కి 1.50 లక్షల రూపాయలను తిరుపతిపార్లమెంట్ యస్.టి.సెల్అధ్యక్షులు యం.సుబ్బయ్య, రాష్ట యస్.టి.సెల్.అధికార ప్రతినిధి పీరిగల నవీన్, జమ్మలమడుగు అద్యక్షులు బి.హనుమంత్‌లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా విరాళం అందించిన వీరిని సిఎం అభినందించారు.

టిడిపిలో చేరిన వైసిపి యువనేత

విశాలాంధ్ర - గంగాధర నెల్లూరు: వైసిపి రాష్ట్ర యువజన జాయింట్ సెక్రెటరీ హరీష్ యాదవ్ వైసీపీ పార్టీకి రాజీనామా చేశారు గంగాధర నెల్లూరు మండలం ఎట్టేరి గ్రామానికి చెందిన హరీష్ యాదవ్ అనంతరం సోమవారం రాత్రి చెన్నైలో ఎమ్మెల్యే డాక్టర్ థామస్ ఆధ్వర్యంలో స్థానిక టిడిపి నేతలతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ టిడిపి వాణిజ్య విభాగ అధికార ప్రతినిధి కోదండరెడ్డి, నేతలు శిల్ప, మునిరాజుల యాదవ్, లాయర్ శరవణ కుమార్, జ్యోతి యాదవ్, నియాజ్ అలీ, నీరజాక్షులు రెడ్డి, శేఖర్, సుబ్రమణ్యం, చిరంజీవి, దాము, క్రిష్ణయ్య, సగి, చిదంబరం పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం

-టీడీపీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు విజయకుమార్ పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని సరస్వతీబాయి పురపాలక పాఠశాలలో 'స్వచ్ఛత హి సేవ' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాలు, పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శ్రీకాళహస్తి పట్టణం భాస్కర్ పేటలో ఆరోగ్య కేంద్రం వారి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు, విద్యార్థులకు ఉచిత వైద్యం అందించి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు నులిపురుగులు చేరకుండా ఉండేందుకు మాత్రలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం ఇన్ ఛార్జి కమిషనరు లలిత, పురపాలక అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాసుకుప్పం పిఎస్సిని తనిఖీ చేసిన జిల్లా క్షయ అధికారి

విశాలాంధ్ర- సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా క్షయ,కుష్టు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో క్షయ,కుష్టు వ్యాధికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, సిబ్బంది నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ,కుష్టు వ్యాధి గ్రస్తులకు సకాలంలో చికిత్సలు అందిస్తూ మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. వ్యాధి తీవ్రత ఉన్నవారిని గుర్తించి మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా ఆరోగ్య కేంద్రాలకు రెఫర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ సుబ్రహ్మణ్యం, జిల్లా ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రవీంద్ర, హెల్త్ ఎడ్యుకేటర్ కిరణ్, ల్యాబ్ టెక్నీషియన్ మురళి, ఫార్మసిస్ట్ భార్గవి, స్టాఫ్ నర్స్ పార్వతి, హెల్త్ అసిస్టెంట్ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత సేవా కార్యక్రమం పై విద్యార్థులచే ర్యాలీ

విశాలాంధ్ర-తడ :స్వచ్ఛత పరిసరాల పరిశుభ్రత అనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం తడ ఎంపీడీవో ఎన్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామాలలో స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగంగా తడ ఉన్నత పాఠశాల విద్యార్థులచే తడ, తడ కండ్రిగ గ్రామ పంచాయతీలలో ర్యాలీ నిర్వహించారు. ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ ఒకటవ తేదీ వరకు మండలంలోని అన్ని పంచాయతీలలో స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నామని ఇందులో భాగంగా మండల స్థాయిలోని అధికారులను గ్రామ పంచాయతీ లకు నియమించి వారి ఆధ్వర్యం లో పరిశుభ్రతపై గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తడకడ కండ్రిగ పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది ప్రజాపాలకులు పాల్గొన్నారు.

నులి పురుగు నిర్మూలన కార్యక్రమంలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర- సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట మండలంలోని కడపట్ర పంచాయతీ నందు గల పాఠశాల నందు మంగళవారం పిల్లలకు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాసనసభ్యులు పిల్లలకు నులిపురుగుల మందులు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, సూళ్లూరుపేట మండలం ఎంపీడీవో ప్రమీలారాణి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గూడూరుకు ప్రజలు సహకరించాలి

- గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ , సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా

విశాలాంధ్ర - గూడూరు : స్వచ్ఛత హి కార్యక్రమంలో భాగంగా గూడూరు పట్టణంలోని ఐసిఎస్ రోడ్డులో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా టిడిపి నాయకులు ర్యాలీ నిర్వహించారు. రోడ్లపై ఉన్న చెత్తను చీపురు పట్టి వారు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో స్వచ్ఛత కార్యక్రమాలు ఏమీ జరగలేదని తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ వరకు స్వచ్ఛత హి కార్యక్రమాల్లో భాగంగా ప్రజలకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా చెత్తాచెదారాలను రోడ్లపై వేయకుండా డస్ట్ బిన్ లో వేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా మాట్లాడుతూ కేవలం పట్టణ పరిధిలోనే కాకుండా గ్రామాల్లో కూడా స్వచ్ఛత హి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ప్రజల భాగస్వామ్యంతో స్వచ్ఛత సాధించగలమని అందరూ సహకరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు శీలం కిరణ్ కుమార్,బిల్లు చెంచురామయ్య, పులిమి శ్రీనివాసులు,రహీమ్, మస్తాన్ నాయుడు, శ్రీనివాసులు, రవీంద్ర రెడ్డి, ప్రణీత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగులవలన పిల్లల ఎదుగుదలపై ప్రభావం

విశాలాంధ్ర-సత్యవేడు: పిల్లల్లో నులిపురుగులు ప్రవేశిస్తే వారి ఎదుగుదలపై ప్రభావం ఉంటుందని తిరుపతి జిల్లా సత్యవేడు జడ్పిటిసి విజయలక్ష్మి చెప్పారు. నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరిం చుకుని మంగళవారం దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పలు పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు సంబంధిత వైద్య సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా సత్యవేడు మాస్టర్ హై స్కూల్లో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు పలువురికి ఆల్బెండజోల్ మాత్రలను జడ్పిటిసి విజయలక్ష్మి వేశారు. ఇదే తరహాలో దలవాయి అగ్రహారం, కోటమిట్ట, బిసి కాలనీ, శ్రీవిద్య స్కూల్ మదనంబేడు, దాసుకుప్పం తదితర ప్రాంతాల్లో పాఠశాలలను ఆయా ఏఎన్ఎంలు సందర్శించి ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సహాయ మేరి, లతదేవి, ఆశా వర్కర్ విద్య, అనురాధ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎం పాఠశాలలో ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

విశాలాంధ్ర- శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా నిర్వహిం చారు. ఇందులో భాగంగా విద్యార్థుల అవ్వ, తాతలు మధ్యాహ్నం భోజనం తీసుకుని వచ్చి పిల్లలకు దగ్గరుండి తినిపించారు. వాళ్లతో ఆడుతూ పాడుతూ సరదాగా గడిపారు. అంతేకాకుండా పాఠశాల తరపున గ్రాండ్ పేరెంట్స్డే సందర్భంగా వారితో ఆడించి, పాడించి ఉత్సాహపరిచి బహుమతులు కూడా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంజీఎం పాఠశాల డైరెక్టరు గుడ్లూరు మయూర్, ఉపాధ్యాయులు,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతను కాపాడుకుందాం

మానవహారంలో పంచాయతీ అధికారులు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : స్వచ్ఛత ప్రాధాన్యంపై స్వచ్ఛత హి కార్యక్రమం ద్వారా గ్రామాలలో పరిసరాల పరిశ్రమలు కాపాడుకోవాలని ఇన్చార్జి ఎంపీడీవో త్రివిక్రమ రావు మంగళవారం పంచాయతీ అధికారులకు వెల్లడించారు. అందులో భాగంగా మండల కేంద్ర పంచాయతీ కార్యదర్శి ఇందిరమ్మ సర్పంచ్ ఉప సర్పంచ్ కె ఎం రాజా లు పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవడం, మహాత్మా గాంధీ వారసత్వాన్ని గౌరవించడం, స్వచ్ఛతను ఓ జీవన విధానంగా మార్చుకోవడమేప్రతిజ్ఞ చేయాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. వస్త్ర సంచులు వినియోగించే లా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. స్వచ్ఛతా ప్రాధాన్యంపై విద్యాలయాల్లో క్విజ్ పోటీల నిర్వహణ, విద్యార్థులకు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి వెంకటసుబ్బయ్య,ఆశా కార్యకర్తలు, ఎ ఎన్ ఎం, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ రవాణా చేస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర - నాయుడుపేట : మంగళవారం ఉదయం నాయుడు పేట మండల పరిధిలో శ్రీనివాసపురం రైల్వే అండర్ పాస్ వద్ద,రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న లారీ, బొలెరో క్యాంపర్ వాహనాలను పట్టణ సీఐ బాబి తన సిబ్బందితో కలిసి స్వాధీనం చేసుకున్నారు. సివిల్ సప్లై సప్లయిస్ డిప్యూటీ తాసిల్దార్ ఓబయ్యతో కలిసి అక్రమ రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వాహనాలను నాయుడుపేట సివిల్ సప్లై గోడౌన్లకు తరలించారు. ఈసందర్భంగా సిఐ బాబి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాలతో నాయుడుపేట డిఎస్పి చెంచుబాబు ఆధ్వర్యంలో రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేస్తున్నారన్న కచ్చిత సమాచారంతో తాము ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. రేషన్ బియ్యాన్ని నాయుడుపేట, సూళ్లూరుపేట పరిసర ప్రాంతాలలో బొలెరో వాహనంతో సేకరించి, బియ్యాన్ని లారీలో లోడ్ చేసి, మదనపల్లికి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఈ సంఘటనలో ఇద్దరూ డ్రైవర్లను, ఒక క్లీనరుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

విశాలాంధ్ర - బాలాయపల్లి : పరిసరాల పరిశుభ్రత తో ఆరోగ్యం గా ఉంటామని తహసీల్దార్ కెవిఆర్వీ ప్రసాద్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతహి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వినీల్ కుమార్, తహసీల్దార్ లు చీపుర పట్టి బస్ స్టాండ్ ఆవరణంలో పరిసరాల ను శుభ్రపరచి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దట్టం అంజలి,ఇంచార్జి ఈఓపిఆర్డి మోహన్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలి

పిహెచ్సి అధికారి వెంకటేశులు

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : విద్యార్థులు రక్తహీనత వ్యాధికి గురి కాకుండా ఆరోగ్యంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య అధికారి డివన్ వెంకటేశులు తెలిపారు. మండలంలో మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆల్బెండజోల్ మందులు మింగించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొదటి విద్యాశాఖ అధికారి కే రవీంద్రనాథ్,ఇన్చార్జి ఎంపీడీవో త్రివిక్రమ్ రావు, ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయుడు పూడి ధనంజయులు పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు రక్త హీనత రావడానికి సరైనటువంటి ఆహారం తీసుకోకపోవడం వల్ల విద్యార్థులు శారీరకంగా బలహీనతకు గురవుతారన్నారు, పౌష్టి ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశలు,అంగన్వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, ఎంఎల్. హెచ్పిలు, మరియు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతి సందర్భంగా జెసి ఘనంగా నివాళులు

విశాలాంధ్ర - తిరుపతి : విశ్వకర్మ జయంతి పురస్కరించుకొని వారి చిత్రపటానికి జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఘనంగా పుష్పాంజలి ఘటించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరం నందు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా జాయింట్ మాట్లాడుతూ సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారని, సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను ఆయన సృష్టించారని తెలిపారు. కమ్మరి, వడ్ల, స్వర్ణకార, శిల్ప కంచరీ వంటి వృత్తులను సృష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేలా ఎనలేని కృషి చేశారని తెలిపారు. విశ్వం యొక్క మొదటి వాస్తుశిల్పిగా విశ్వసించే విశ్వకర్మను పూజించడం ద్వారా ప్రజలు విశ్వకర్మ జయంతిని జరుపుకుంటారని అన్నారు. కావున విరాట్ విశ్వకర్మను ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణ వాయువును కాపాడుకుందాం: పీడి

విశాలాంధ్ర-దొరవారిసత్రం: అందరం కలిసి కట్టుగా మొక్కలను నాటి ప్రాణ వాయువును కాపాడుకుందాం అని ఎన్‌హెచ్‌ఏఐ పీడి ఎమ్‌కే చౌదరి అన్నారు. మంగళవారం దొరవారిసత్రం మండల పరిధిలోని తల్లంపాడు టోల్ ప్లాజా నుండి మావిళ్ల పాడు గ్రామం వరకు మోడల్ స్కూల్ విధ్యార్థులతో నేషనల్ హైవే అథారిటి ఆఫ్ ఇండియా వారు ఒక చెట్టు తల్లి పేరుతో మొక్కలను నాటే కార్యక్రమాని ఏర్పాటు చేశారు.జాతీయ రహదారి వెంబండి ఇరువైపులా ఉన్న కాలి స్థలంలో వివిధ రకాల మొక్కలను విధ్యార్థుల చేత నాటించారు.అనంతరం విద్యార్ధులకు మొక్కలు పెంచడం ద్వారా కలిగే ప్రయోజనాలను తెలియజేశారు.వీరితోపాటు డీఎం సుధాంసు, సివోఎం హరి పాండు రంగ స్వామి,మెయిన్‌టేన్స్ మెనేజర్ నాగరాజు,టోల్‌ప్లాజా మెనేజర్ రమేష్,స్టాఫ్ మెనేజర్ మనోజ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

దళితుల భూమి జోలికి వస్తే సహించం

-సీపీఐ నేత జనమాల గురవయ్య

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: దళితుల భూముల జోలికి వస్తే సహించమని భారత కమ్యూనిస్టు పార్టీ ప్రాంతీయ కార్యదర్శి జనమాల గురవయ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాళహస్తి మండలంలో కొంతమంది టీడీపీ నేతల కన్ను దళితుల భూములపై పడిందన్నారు. 1991లో శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం దగ్గర దళితులకు సాగు కోసం ఒక్కో కుటుంబానికి రెండు ఎకరాలు చొప్పున అప్పటి కలెక్టర్ నాగార్జున, జాయింట్ కలెక్టర్ వెంకట రమేష్, తహసీల్దారు గురుమూర్తి ఆధ్వర్యంలో నాలుగు గ్రామాల దళితులకు ఇచ్చారన్నారు. అప్పటి నుంచి దళితులు ఈ భూమి సాగు చేసుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ దళితుల భూములపై తెలుగుదేశం పార్టీ మండల నాయకులు కన్ను పడడంతో మధ్యవర్తులుగా కొంతమందిని పిలిపించి ఎకరా రూ. 8 లక్షలు దళితులకు ఆశ చూపి కొనుక్కోవడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ భూమిని అమ్మకూడదని కొంతమంది దళితులు వ్యతిరేకిస్తున్నప్పటికీ వారికి వారికి మధ్య గొడవలు పెట్టి ఈ భూములను అర కొర రేట్లతో కొట్టేయాలని చూస్తున్నారన్నారు. దళితుల భూములను దళితులకే ఉండేలా చేయాలని జనమాల గురవయ్య కోరారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో మరో భూ పోరాటానికి సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.

ఘనంగా నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు బీజేపీ నేతలు శ్రీకాళహస్తిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా పార్టీ ఇన్చార్జి పార్థ సారధి, జిల్లా ప్రధాన కార్యదర్శి వరప్రసాద్, జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, రాష్ట్ర ఓబీసీమోర్చా సభ్యులు ఎస్వీ రమణ, చాగణం శైలజ, గరికపాటి రమేష్ బాబు, వేదం కృష్ణయ్య, పుణ్యం ఢిల్లీ కుమార్, సుబ్రహ్మణ్యం రాజు, కన్నా వెంకటేశ్వర్లు, జీవీ అమర్నాథ్, చొక్కని రవి చంద్ర, కోనేటి అయ్యప్ప, రవి, చెందు, బొక్కసం యుగంధర్, డాక్టర్ నారాయణ, రవి ఆచ్చారి, సూరా బిందు కుమార్, సంద్ర విద్యా సాగర్, కుమార్, శివ, పసుపులేటి మురళి, తాని కొండ్ల భరత్ కుమార్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోడీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - గంగాధ రనెల్లూరు : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 74 పుట్టినరోజు పురస్కరిం చుకొని గంగాధర నెల్లూరు లో అధికార పార్టీకి చెందిన కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు .ఈ సందర్భంగా నేతలు కలిసి మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు ఈ కార్యక్రమంలో కూటమి నేతలు మణివర్మ, ఇడగట్టి సుధాకర్ ,మురళి, వెంకటేష్ స్వామిదాస్,దేవసుందరం, సుందరరాజ్,కృష్ణమూర్తి రెడ్డి, సురేష్ రెడ్డి, జ్యోతి యాదవ్, కండిగ శంకర్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

రంగయ్య నాయుడు మృతికి ఎమ్మెల్యే సంతాపం

విశాలాంధ్ర - పలమనేరు : పలమనేరు మాజీ వైస్ ఎంపీపీ రంగయ్య నాయుడు మృతి పట్ల పలమనేర్ శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి తన సంతాపాన్ని తెలియజేశారు. పలమనేరు మండలం మొరం పంచాయతీ రామాపురం గ్రామానికి చెందిన రంగయ్య నాయుడు అనారోగ్యం కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చెందారు. పలమనేరు మండల రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన రంగయ్య మృతి బాధాకరమని ఎమ్మెల్యే దిగ్భ్రాంతి వ్యక్తపరిచారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ వద్దు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడకూడదని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ డి.గోపి సూచించారు. తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వుల మేరకు శ్రీకాళహస్తి పట్టణంలోని రాలయసీమ జూనియర్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు డ్రగ్స్, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్స్, ట్రాఫిక్ నియమాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఇక ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గోపి కోరారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించకూడదన్నారు. అలా ఎవరైనా చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

హెచ్ఐవి, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర - దొరవారి సత్రం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటి ఆదేశాలు మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ,జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ విభాగం సహకారం తో నవజీవన్ ఆర్గనైజేషన్ సిసిపియు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మీకు తెలుసా కార్యక్రమం ద్వారా హెచ్ఐవి ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దొరవారి సత్రం మండల పరిధిలోని ఏకోలు జిల్లా ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెడ్ మాస్టర్ సి. హెచ్. నరసింహారావు, నవజీవన్ సిసిపియు ప్రాజెక్ట్ మేనేజర్ కె. బాలాజి, ఓ.ఆర్.డబ్ల్యూ అయిన వి.ఐశ్వర్య, ఎయన్‌యమ్ జి. హరిత, పి.ఇడి. నాగార్జునమ్మ మరియు 70 మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. తడ మండలం లోని కాదలూరు గ్రామంలో కూడా హెచ్.ఐ.వి,ఎయిడ్స్ పై అవగాహన కల్పించడం కోసం ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో 60 మంది ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది. వీరిలో 20 మంది ప్రజలుకు నవజీవన్ సంస్థ ఎ.యన్.యమ్ అయిన జి. హరిత ద్వారా హెచ్.ఐ.వి పరీక్షలు చేయించారు.

మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని కాపాడుదాం

విశాలాంధ్ర పుంగనూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనం మనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూజ గాని పల్లి గ్రామంలో రోడ్డు ఇరువైపులా టిడిపి జనసేన మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి విరుపాక్షి ఆధ్వర్యంలో మంగళవారం రోజున మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ మొక్కల నాటి పర్యావరణం కాపాడడం వలన మానవ మనుగడకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రోగ్రాం సెక్రటరీ చైతన్య రాయల్ టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ గంగాధర్ స్కూల్ చైర్మన్ జయన్న మహేంద్ర హరి గంగిరెడ్డి మహేష్ సీన పాల్గొన్నారు.

ఘనంగా నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర పుంగనూరు: మన దేశ ప్రధాని నరేంద్ర మోడీ 74వ జన్మదిన వేడుకలను పట్టణ బిజెపి నాయకులు ఆధ్వర్యంలో మంగళవారం రోజున ఘనంగా నిర్వహించారు గోకుల్ సర్కిల్ నందు ఆయన జన్మదిన పురస్కరించుకొని పెద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించి భారీ కేకును కట్ చేసి పార్టీ నాయకులు కార్యకర్తలు ఒకరికొకరు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ మోర్చా నాయకులు నర్సింహులు మాట్లాడుతూ దేశంలో మూడు పర్యాయాలు ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రధానిగా కొనసాగడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అయూబ్ ఖాన్ బాబు మల్లికా రాణి రాజా జెట్టి లక్ష్మణ్ కుమార్ ఆదినారాయణ టీడీఎస్ వెంకటప్రసాద్ విజయభాస్కర్ రెడ్డి శ్రీనివాసులు మంజునాథ వెంకటరెడ్డి రమేష్ గిరిబాబు నాగరాజు అమర్నాథ్ పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని మంగళ వారం తాడేపల్లి గూడెం శాసన సభ్యులు బొల్లిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. జనసేన పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి కొట్టే సాయి ఈయనకు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాధవ మహేష్, ఈర్ల చిరంజీవి, వేణుగోపాల్, నక్క ప్రసాద్, షేక్ ఆరిఫ్, జానీ భాషా, హుస్సేన్, మహర్షి పాల్గొన్నారు.

పుస్తక పఠనంతోనే మేధో శక్తి

తిరుపతి ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు మోహన్ రాజు

విశాలాంధ్ర - పాలసముద్రం : చిన్నతనం నుంచే పుస్తక పఠనంతో మేధో శక్తి కలుగు తుందని ఎస్వీ డిజిటల్ అధినేత, తిరుపతి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు, మండలవాసి మోహన్ కుమార్ రాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వెంగళ రాజు కుప్పం, బలిజిగండ్రిగ జడ్పీ ఉన్నత పాఠశాలలో పిల్లల్లో క్రియేటివిటీని, రైటింగ్ స్కిల్స్ ను పెంచే ప్రఖ్యాత చిత్రకారుడు శ్రీ బాపు బొమ్మలతో నామిని సుబ్రహ్మణ్యం నాయుడు సినప్ప కతలు పుస్తకాలను ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రఘు, చక్రధర్ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణం మెరుగు

విశాలాంధ్ర -బాలాయపల్లి : మొక్కల పెంపకంతో పర్యావరణం మెరుగు పడుతుందని ఎంపీడీఓ వినీల్ కుమార్ అన్నారు. మంగళవారం అలిమిలి, పల్లిపాడుగ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో ఏపిఒ మృత్యుంజయ రావు,వివో పి ఆర్ డి మోహనరాజు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలలో ఉద్యోగుల సేవలు మరవలేనివి

ఎపిజేఏసి అమరావతి జిల్లా చైర్మన్

విశాలాంధ్ర-దొరవారిసత్రం: విజయవాడలో వరద సహాయక చర్యలలో జిల్లా ఉద్యోగ యంత్రాంగం చేసిన సేవలు మరవలేనివి అని ఎపిజేఏసి అమరావతి జిల్లా చైర్మన్ ,ఎపిఆర్ఎస్ఏ సెక్రటరీ పెళ్లూరు గోపినాద్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లా అధికారులు వరదబాధితులకు పగలు, రాత్రి లేకుండా నిత్యవసర సరుకులను పంపిణీ చేయడంలో అలు పెరుగని సేవలు అందించి ప్రజల ఆదరణలను పొందారు అన్నారు.వరద సహాయక విధులు నిర్వహించి తిరిగి ఆయా జిల్లాల్లో విధులకు హాజరౌవుతున్న అధికారులకు ఎపిజేఏసి అమరావతి జిల్లా చైర్మన్, ఎపిఆర్ఎస్ఏ సెక్రటరీ పెళ్లూరు గోపినాద్ రెడ్డి అభినందనలను తెలిపారు.

ప్రమాదంలో ద్విచక్ర వాహనం ఆహుతి

విశాలాంధ్ర - రామకుప్పం : రామకుప్పం గ్రామ పంచాయతీ 89 పెద్దూరు రోడ్డు కూడలి వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు మరియు వెల్డింగ్ షాపు యజమాని కథనం మేరకు వివరాలు ద్విచక్ర వాహనం మరమ్మతులకై వెల్డింగ్ షాపుకు తీసుకొచ్చారు. వెల్డింగ్ చేస్తుండగా వాహనంలో పెట్రోల్ లీకేజ్ కావడంతో ఒక్క సారిగా మంటలు చెలరేగి చుట్టుపక్కలకు వ్యాపించాయని స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేస్తున్నప్పటికీ పెట్రోల్ వాహనం కావడంతో పూర్తిగా అగ్నికి ఆహుతయింది. దీంతో సుమారు 20 వేల రూపాయలు నష్టం కలిగిందని స్థానికులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛతతను పాటించాలి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : ప్రతి ఒక్కరూ స్వచ్ఛతను పాటించాలని తుమ్మల గుంట పంచాయతీ కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు.మంగళవారం తిరుపతి రూరల్ మండలం తుమ్మల గుంటలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో కలసి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలలో స్వచ్ఛత హి సేవా పక్షోత్సవాల్లో భాగంగా తుమ్మలగుంటలో ర్యాలీ చేపట్టారు.వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.అనంతరం పలువురు స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు బిరుదుల భాస్కర్ రెడ్డి,రాష్ట్ర వాణిజ్య విభాగం ఆర్గనైజింగ్ సెక్రటరీ ఓ.కేశవులు శెట్టి, కె.శ్రీనివాసులు, బి.సిద్దారెడ్డి,బి.తులసిరామి రెడ్డి,సుబ్రమణ్యం, పి.భరత్ రెడ్డి, పి.జయ చంద్రారెడ్డి, పి.మనోహర్, రామకృష్ణ ,బాలాజీ పాల్గొన్నారు.

బాలాజీ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాష్ట్ర నాయకుడు పుణ్యమూర్తి

విశాలాంధ్ర-పుత్తూరు టౌన్: నారాయణ వనం బాలాజీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న డేవిడ్ బాలాజీని స్కూటర్లో ఢీకొనడంతో అక్కడి కక్కడే మృతి చెందడంతో బ్రాహ్మణ తాంగల్ గ్రామ పంచాయతీకి చెందిన వడ్డిండ్లు బాలాజీ కి ఇద్దరు కుమారులు ఒక కుమార్తె చిన్న చిన్న పిల్లలు స్కూటర్ ఆక్సిడెంట్ లో బాలాజీ మృతి చెందడంతో ఆల్ ఇండియన్ అంబేద్కర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు అధ్యక్షులు పుణ్యమూర్తి నారాయణ వనం పోలీస్ స్టేషన్ వద్ద మృతి చెందిన బాలాజీ కుటుంబాన్ని వారి పిల్లలను భార్యను ఆయన స్వయంగా బాధితులు ను పరామర్శించి వీరికి ఈ రాష్ట్ర ప్రభుత్వపరంగా ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియన్ అంబేద్కర్ అసోసియేషన్ నాయకులు మహేష్ అన్న శేఖర్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇంటర్ విద్య పునాది

విశాలాంధ్ర- సత్యవేడు: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇంటర్ విద్య పునాది అని తిరుపతి జిల్లా సత్యవేడు ఎంపీడీవో చంద్ర శేఖర్ చెప్పారు. మంగళవారం సత్యవేడు వివిఎకె కళ్యాణ మండపంలో కళాశాల కరస్పాండెంట్ పరందామ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎంఈఓ రవి,ఎంఈఓ టు ఉష, మాదరపాకం హెచ్ఎం ధనంజయ,ఫిజికల్ డైరెక్టర్ కరుణ,నాగలాపురం ఉపాధ్యాయులు వేలాయుధం తదితరులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాబర్ట్, టిడిపి పట్టణ అధ్యక్షులు చెన్ముగం,కళాశాల అధ్యాపకులు భాస్కర్,పలని,ప్రసన్న కుమార్,ఈశ్వర్, ఐలు,అపర్ణ,భానుప్రియ,దీప,ప్రియాంక,సుకన్య, సూర్య పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరణియార్ టూరిజం పనులు సుప్రీంకోర్టు నిబంధనలకు విరుద్ధం

విశాలాంధ్ర -పిచ్చాటూరు :తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు ఆరణియార్ ప్రాజెక్ట్ వద్ద చేపడుతున్న టూరిజం పనులు ట్యాంక్ లోపల జరుగుతున్నందున సత్వరం నిర్మాణ పనులు ఆపివేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామా నాయుడు, రైతు సంఘం నేత డా.టి. జనార్దన్‌లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం సిపిఐ, రైతు సంఘం ప్రతినిధులు ఆరణియార్ ప్రాజెక్టును సందర్శించి చెరువు లోపల 2:కోట్ల తుడ నిధులతో జరుగుతున్న టూరిజం పనులను పరిశీలించారు. టూరిజం అభివృద్ధి పనులకు కమ్యూనిస్టు పార్టీ రైతు సంఘం లు వ్యతిరేకం కాదని అయితే సుప్రీంకోర్టు నిబంధనలను తుంగలో తొక్కి కట్ట లోపల చెరువును పూడ్చి పనులు చేపట్టడం తీవ్ర అభ్యంతరకరమని పేర్కొన్నారు. కట్టకు వెలుపల 100 అడుగుల దూరంలోనే ఎలాంటి నిర్మాణాలు గానీ అభివృద్ధి కార్యక్రమాలు గాని చేపట్టాల్సి వుందనే నిబంధనలు ఉన్నా, ప్రభుత్వ సంస్థలే కాల రాయడం ఎంతవరకు సబబని వారు ప్రశ్నించారు. భవిష్యత్తులో పర్యావరణ కు తీవ్ర ప్రమాదమే కాక ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్ ఎల్ టీ)కు నీరు చేరుకున్నప్పుడు పర్యాటకులకు కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని వారు తెలిపారు. సత్వరం తుడ టూరిజం పనులు ఆపివేయాలని లేనిచో న్యాయపరంగా తాము పోరాటానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు చిన్నరాజు, మహేష్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులను అడ్డుకోండి

విశాలాంధ్ర -బాలాయపల్లి : మండలం లోని సిద్దగుంట గ్రామంలో ప్రభుత్వ భూములను గత వారం రోజులుగా జేసీబీ లతో ఆక్రమిస్తున్న అడ్డుకునేవారే లేరని, భూ ఆక్రమణదారులను అడ్డుకోండి మహాప్రభో అంటూ సిద్దగుంట గ్రామస్తులు తహసీల్దార్ ప్రసాద్ రావు కు మంగళవారం వినతి పత్రం ఇచ్చారు.సిద్దగుంట గ్రామ సర్వే నెంబర్ 114లో పశువులు మేత పోరంబోకు భూములు సుమారు 340 ఎకరాలు భూమి ఉండగా కొంత భూమి అటవీ శాఖ ఆధీనం లోకి వెళ్ళింది. మిగులు భూమి సుమారు 80ఎకరాలు ఉండగా ఇటీవల భూ ఆక్రమణ దారులు కన్ను ప్రభుత్వ భూమి పై పడింది. దాంతో గత వారం రోజులు క్రితం జెసిబి లతో అక్రమంగా భూమి లోని చెట్లు తొలగిస్తున్నారని రెవిన్యూ అధికారులు కు గ్రామస్తులు నుండి చరవాణి ద్వారా ఫిర్యాదు రాగా అడ్డుకోవడానికి వెళ్లిన వి ఆర్ వో కు మండల అధికార పార్టీ నాయకులు ద్వారా జెసిబి లను అడ్డుకోవద్దు అంటూ ఆదేశాలు అందినట్టు సమాచారం.దీంతో రెచ్చిపోయిన భూ ఆక్రమనదారులు సుమారు 50 ఎకరాలు అక్రమంగా ఆక్రమించారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామంలోని ఎక్కువ మంది మహిళలు పశు వులు మేపుకుంటూ పాలవ్యాపారం పై జీవిస్తున్నారని తెలిపారు. ఆ భూమి ఆక్రమణకు గురైతే పశువులు మేతకు ఖాళీ భూమి లేదని తమ జీవనదారం కోల్పోతామని కన్నీటి పర్యాంతమ య్యారు. స్పందించిన తహసీల్దార్ ప్రసాద్ రావు విచారించి భూమి ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పెద్దిరెడ్డిని కలిసిన నూక తోటి రాజేష్

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నారాయణ వనం మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు అనంతరం యువకుడు యువ నాయకుడు రాకేష్ కిరణ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే పరిష్కరించుకుంటూ ఆయన మాట్లాడుతూ నాయకులకు కార్య కర్తలకు అండగా పెద్దాయన పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి ఆయన ఆశయాలతో మనమందరం కలిసికట్టుగా పార్టీ బలపతో చేయ దానికి అందురూ ఏకమవ్వాలని ఆయన తెలిపారు ఈ కార్యక్ర మంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అన్నా దొర మండల ఎంపీపీ దివాకర్ కన్వీనర్ సారకాయలు పెద్దబ్బ తిరువం గడం పీజే బాబు అశోక్ మునికృష్ణ రజిని కార్యకర్తలు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం అందజేత

విశాలాంధ్ర- పుంగనూరు: పట్టణంలోని కుమ్మర వీధికి చెందిన శ్రీ వరసిద్ధి వినాయక సేవా సంఘం వారు వరద బాధితుల నిమిత్తం మంగళవారం రోజున 11116 రూపాయలు డిడి రూపంలో తాసిల్దార్ జె రాముకు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సివిరెడ్డి శ్రీ వరసిద్ధి సేవా సంఘం వారు పాల్గొన్నారు.

ఆర్ఓ ప్లాంట్లు ప్రారంభించిన పులివర్తి నాని

విశాలాంధ్ర - రామచంద్రాపురం : మండలం లోని సి రామాపురం, మిట్టూరు ఎవడబ్బు, బలిజపల్లి గ్రామాలలో మంగళ వారం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆర్ ఓ ప్లాంట్ లను ప్రారంభించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఎక్కడ ప్రభుత్వ భూములు, గుట్టలు, మఠం భూములు, ఆక్రమించుకొని రాజకీయాలు చేసుకునేవారు. తాను ఎప్పటికీ ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలు తెలుసుకుంటూ ప్రజానాయ కుడిగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం రెడ్డి,తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమల రెడ్డి,ఉపాధ్యక్షుడు కొట్టే గిరిధర్ రెడ్డి, చిన్నబాబు,చేకూరి జనార్దన్ చౌదరి, కొట్టే నరసింహా రెడ్డి, కొల్లంగుంట మునిరామిరెడ్డి, కొట్టే ధనుంజయ రెడ్డి,దుర్గ సముద్రం హరిప్రసాద్, త్యాగరాజులు, చేకూరి ప్రసాద్, మోహన్ రెడ్డి,తాసిల్దార్ వెంకటరమణ,ఇఓపిఆర్డి, వ్యవసాయ అధికారి స్రవంతి, మండల ఎస్సై రామాంజనేయులు, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది, మహిళా సంఘాలు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

చారాల సీజేఎఫ్ లో ఏనుగుల దాడి

- రూ రెండు లక్షల పంట నష్టం

విశాలాంధ్ర - చౌడేపల్లి : మండలంలోని దుర్గ సముద్రం పంచాయతీ పరిధిలో గల చారాల సీజేఎఫ్ లో సోమవారం రాత్రి ఏనుగులు దాడి చేశాయి ఈ దాడిలో పంట పొలాలు తీవ్రంగా ధ్వంసం అయ్యాయి గంగాధరం సుబ్రహ్మణ్యం శ్రీనివాసులకు చెందిన వరి మామిడి టెంకాయ పంటలు ధ్వంసం అయ్యాయి. సోమల అడవిలో నుంచి ఏనుగుల గుంపు పొలాలపై పడడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు వాటి విలువ రూ 2 లక్షల వరకు ఉంటుందని రైతులు వాపోయారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ హనుమంతు నాయక్ పంట నష్టాన్ని అంచనా వేయాలని వీఆర్వో పురుషోత్తం రావు ను ఆదేశించారు. ఈ మేరకు వీఆర్వోతో పాటు ఫారెస్ట్ అధికారి రవికుమార్లు సీజేఎఫ్ఎస్‌లో ఏనుగులు ధ్వంసం చేసిన పంట పొలాలను పరిశీలించారు రైతులు తమ గోడును అధికారులకు వివరించారు.

పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధిలో కలిసి నడుద్దాం

: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి నిధులు రెడ్డి

విశాలాంధ్ర - చౌడేపల్లి : పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధిలో కలిసి నడుద్దామని తెలుగుదేశం పార్టీ నాయకులను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కోరారు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ప్రజలు వైకాపా నాయ కులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలి కానీ తర్వాత అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు. కర్ణాటక సరిహద్దు నుంచి పుంగనూరు చౌడేపల్లి మీదుగా అన్ని మండలాలను కలుపుతూ రొంపిచర్ల క్రాస్ వద్ద జాతీయ రహదారికి రోడ్డును ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి గడ్కరీని కోరినట్లు వివ రించారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తమ కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ ప్రజలు కార్యకర్తలకు అండగా ఉంటామని సమస్యలు పరిష్కార దిశగా అడుగులు వేస్తామని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

ఎమ్మెల్యే చేతుల మీదుగా ఇళ్ళ పట్టాల పంపిణీ

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : సూళ్లూరుపేట మండలంలోని కడపట్ర పంచాయతీ నందు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లు లేని ప్రతి ఒక్కరికి ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు, అదేవిధంగా రోడ్డు నిర్మాణం కూడా చేపట్టతనని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాకం. వెంకటసుబ్బయ్య, గొంజి వెంకటేశ్వర్లు ,తిరుపాల్ ,సుధాకర్ రెడ్డి , సుబ్రహ్మణ్యం , చంద్ర రెడ్డి , వీరితోపాటు ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాయుడుపేట వాసులకు తిరుమల లడ్డు ప్రసాదాలు

విశాలాంధ్ర - నాయుడుపేట : నాయుడుపేట కరీమాణిక్యస్వామి గుడివద్దకు తిరుపతి తిరుమల దేవస్థానం ఆధ్వర్యంలో తిరుమల లడ్డు ప్రసాదాలు సోమవారం చేరుకున్నాయి. మంగళవారం ఉదయం నుంచి లడ్డులు భక్తులకు అధికారులు విక్రయించారు.తొలుత 300 లడ్డులు గుడివద్దకు చేరుకోగా గంటల వ్యవధిలోనే అవి అమ్ముడైనాయి. తిరుమల నుంచి శుక్రవారం మరికొన్ని లడ్డు ట్రేలు గుడి వద్దకు చేరనున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థాన ఈవో శ్యామలరావు, టిటిడి ఆధ్వర్యంలో ఉన్న గుడులలో లడ్డుల ప్రసాదాలు విక్రయించాలని సంకల్పించారు. నియోజకవర్గ పరిధిలో తుమ్మూరు కరిమాణిక్యస్వామి గుడి తోపాటు సూళ్లూరుపేట మండలం, మన్నారు పోలూరు గ్రామం నందు ఉన్న అలగమల్లారి కృష్ణస్వామి దేవస్థానంనందు భక్తులకు తిరుమల లడ్డు ప్రసాదాలు అందుబాటులోకి వచ్చాయి. ఈకార్యక్రమంలో ఉప కార్యనిర్వాహణాధికారి దేవేంద్రబాబు,సూపరెంటెడ్ జ్ఞానకిషోర్, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి,సుధీర్, పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం పై ర్యాలీ

విశాలాంధ్ర-చిట్టమూరు: చిట్టమూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం పై చిట్టమూరు మండల టిడిపి కన్వీనర్ గణపర్తి కిషోర్ నాయుడు పాల్గొనగా తాసిల్దార్ ఐఎస్ ప్రసాద్ ఈవోపీఆర్డి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యార్థులతో ఉద్యోగ స్తులతో కలిసి మండల పరిషత్ కార్యాలయం నుండి చిట్టమూరు లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ఐఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రానున్న శీతాకాలం దృష్టిలో ఉంచుకొని తమ ఇళ్ల వద్ద పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని అంటు వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చేతులు శుభ్రంగా కడుక్కొని ఆహారం తీసుకోవాలని తాసిల్దార్ తెలిపారు. అనంతరం మండల టిడిపి అధ్యక్షులు కిషోర్ నాయుడు మాట్లాడుతూ గతంలో నారా చంద్రబాబు నాయుడు డబ్బింగ్ యార్డు ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి ఇంట్లో రెండు ప్లాస్టిక్ బకెట్లు ఉంచుకొని పొడిచెత్త ఒక బకెట్లో తడి చెత్త ఒక బకెట్లో పంచాయితీ పనివాళ్ళు తమ వీధుల్లోకి వచ్చినప్పుడు ఈ చెత్తను ఆ బండులో వేయాలని ఆ చెత్తను డంపింగ్ యార్డు లో వేసి ఎరువుగా మార్చడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కార్యాలయం సిబ్బంది మండల పరిషత్ సిబ్బంది టిడిపి నాయకులు కావులు చెంచురామయ్య,గుణపాడు మోహన్ రెడ్డి, అంకబాబు విద్యార్థులు పాల్గొన్నారు.

2 వరకు ప్రధాని జన్మదినోత్సవాలు

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం నుంచి 17వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి వరకు సేవా కార్యక్రమాలను తలపెట్టినట్లు నేషనల్ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సురేందర్ రెడ్డి, తిరుపతి జిల్లా జనరల్ సెక్రెటరీ పెను బాల చంద్రశేఖర్లు వెల్లడించారు. తిరుపతి ప్రెస్క్లబ్లో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. పక్షం రోజులపాటు జన్మదినోత్సవాలలో రక్తదానం, పాఠశాలలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ అక్టోబర్ రెండవ తేదీ గాంధీ జయంతి రోజున జయంతోత్సవాలు సమాప్తం అవుతాయని అన్నారు. బీజేపీ నాయకులు జనార్ధన్, శ్రీహరి రావు పాల్గొన్నారు.

సృష్టికి ప్రతి సృష్టే విశ్వకర్మ

విశాలాంధ్ర - తిరుపతి సిటీ: స్థానిక రాస్ బిల్డింగ్లో మంగళవారం ఘనంగా విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విశ్వం పుట్టకముందే అంధకారం నుంచి విశ్వకర్మ అవతరించారని అన్నారు. సృష్టికి ప్రతిసృష్టిగా పంచబ్రహ్మలను విశ్వకర్మ సృష్టించి తద్వారా పంచ వృత్తులైన ఆభరణాల తయారీకి బంగారు, వ్యవసాయ పనిముట్లకు ఇనుము, రాగి ఇత్తడి వంట పాత్రలు, గృహాలకు చెక్క తలుపులు, కిటికీలు తదితర లోహపు వృత్తులను విశ్వబ్రాహ్మణులు తయారు చేసే లాగా సృష్టికి ప్రతి సృష్టి చేసిన విశ్వ కర్మ గొప్పవాడని కొనియాడారు. మానవులు ఆదిమానవుల దశ నుంచి ఉత్తమ మానవులుగా మారడానికి, దైవభక్తి మీద వారి ధ్యానను మరల్చడానికే విశ్వబ్రాహ్మణులు వారి వృత్తుల ద్వారా కాలానుగుణంగా ఆధునిక యుగానికి నాంది పలికారని కొనియాడారు. అలాగే చంద్రగిరి మెయిన్ రోడ్డు లోని పేరూరు వద్ద ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాలలో విశ్వబ్రాహ్మణులైన శ్రీమంతుల రామయ్య, చేజర్ల మనోహరాచారి, ఉమాపతి ఆచారి రాజశేఖర్ ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - వి.కోట: భారత ప్రధాని నరేంద్ర మోదీ 74 వ. పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం మండలంలో భాజపా మండల అధ్యక్షుడు సోమశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అసెంబ్లీ కన్వీనర్ గొనివారి విజయ్ కుమార్ ఎగువ చెక్పోస్ట్ వద్ద పార్టీ జెండా ఎగురవేసి, స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు పద్మనాభం, చలపతి, ప్రమీలమ్మ, శ్రీనివాసులు,హనుమంత రెడ్డి, నవీన్, మోహన్, మంజు, బంగారు రెడ్డి, బాలకృష్ణ,చరణ్, కోదండ, రాజప్ప, జయచంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ పుట్టిన రోజు కానుకగా

మొక్కలు నాటే కార్యక్రమం

విశాలాంధ్ర - సోమల : సోమల మండలంలో కె వి ఎన్ కళాశాల లో భారతీయ జనతా పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జ్ గన్న మదన్ మోహన్ బాబు ఆధ్వర్యంలో ప్రియతమ నేత మన భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవిఎన్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు మరియు ఎన్డీఏ కూటమి నాయకులతో కలిసి నిర్వహించడం జరిగింది. తెలుగుదేశం నాయకులు గందోడి బాబు, శెట్టి వారి అశోక్ కుమార్, భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు విశ్వనాథం నాయుడు, మండల అధ్యక్షుడు శ్రీరామ్ రామ్మూర్తి, జనసేన మండల నాయకుడు నాగ భూషణం, మండల జనరల్ సెక్రెటరీ చంద్రయ్య, ఓబిసి మోర్చా జిల్లా కార్యదర్శి గంగులప్ప, సీనియర్ నాయకులు నరేంద్ర గుప్తా, సుబ్రహ్మణ్యం, లక్ష్మీపతి పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ద్వారా నులిపురుగులను నివారించవచ్చు

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటి నగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వారి సహకారంతో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయులు రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రలను కనీసము ప్రతి ఆరు నెలలకు ఒకసారి తీసుకుంటే నులిపురుగుల సంక్రమణను సులభముగా నిర్మూలించవచ్చు అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్ సెంటర్ నుండి శిరీష, మంజుల కళాశాల అధ్యాపకులు డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం ఆచారి, డాక్టర్ సీఎం లత తదితర అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 220 మంది విద్యార్థులు ఆల్బెండజోల్ మాత్రలను తీసుకున్నారు.

మౌళిక సామగ్రి ఏర్పాటుకు తన వంతు కృషి

రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి పోతు గుంట విజయబాబు

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : చిన్న రాజు కుప్పం, చెర్లోపల్లి, నెత్తం పాఠశాలల్లో మౌళిక సామగ్రి ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తున్నట్టు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు తెలిపారు. అందులో భాగంగా చెర్లోపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు విద్యా సామాగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం చెర్లోపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలకు ఆయన ఒక బీరువా, కుర్చీలు, నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ మూడు గ్రామాల్లోని పాఠశాలలకు మరింత సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇ.రవి నాయుడు, బాలాజీ నాయుడు, ధనపాల్, కుమార్ రెడ్డి, చంద్ర యాదవ్, అజయ్ చౌదరి, పా?ండురంగయ్య, టీచర్ జలజ,శంకర్ మండడి ,జయచంద్రరెడ్డి, శ్రీనివాసులు, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో ఈవో విస్తృత తనిఖీలు

విశాలాంధ్ర - తిరుమల కల్చరల్ : టిటిడి ఈవో జె శ్యామలరావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మంగళవారం తిరుమలలోని సిఆర్ఓ జనరల్ మరియు నారాయణగిరి షెడ్లు, క్యూ లైన్లను తనిఖీ చేశారు.అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గత మూడు రోజులుగా వరుస సెలవులు, పురటాసి మాసం రావడంతో తిరుమలలో భక్తుల రద్దీ పెరగడంతో పాటు, ఎస్ఎస్డీ టోకెన్లు లేని భక్తులకు దాదాపు 20 నుండి 24 గంటల సమయం శ్రీవారి దర్శనానికి పడుతోందన్నారు. కావున దర్శనం కోసం భక్తులు తమ వంతు వచ్చే వరకు ఓపికతో వేచి ఉండాలన్నారు. వైకుంఠం కంపార్ట్మెంట్లు, నారాయణగిరి షెడ్లు, బయట క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులకు అన్నప్రసాదం, తాగునీరు, పాలు, టీ, కాఫీలను టీటీడీ యాజమాన్యం నిరంతరాయంగా అందించేందుకు విస్తృత ఏర్పాట్లు చేసిందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఈ ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులను కూడా టీటీడీ నియమించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఈ సత్యనారాయణ, డిప్యూటీఈవోలు భాస్కర్, హరేంద్రనాథ్, వి ఎస్ ఓ సురేంద్ర, సిపిఆర్వో డాక్టర్ టి.రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణ లోని టవర్ క్లాక్ సెంటర్ వద్ద దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పాల్గొన్నారు.అనంతరం, కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు మనోజ్ కుమార్ , కిరణ్ , తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధిలో కలసి నడుద్దాం : రాజంపేట ఎంపీ

విశాలాంధ్ర - చౌడేపల్లి : పుంగనూరు నియోజకవర్గ అభివృద్ధిలో కలిసి నడుద్దామని తెలుగుదేశం పార్టీ నాయకులను రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి కోరారు మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ప్రజలు వైకాపా నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల అప్పుడు మాత్రమే రాజకీయాలు చేయాలి కానీ తర్వాత అభివృద్ధి వైపు అడుగులు వేయాలన్నారు కర్ణాటక సరిహద్దు నుంచి పుంగనూరు చౌడేపల్లి మీదుగా అన్ని మండలాలను కలుపుతూ రొంపిచర్ల క్రాస్ వద్ద జాతీయ రహదారికి రోడ్డును ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి గడ్కరీ ని కోరినట్లు వివరించారు. అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పుంగనూరు నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేశామని గుర్తు చేశారు. ముఖ్యంగా బోయకొండ గంగమ్మ ఆలయం ఆగిస్తీశ్వరుని కొండ లాంటి ఆలయాల అభివృద్ధికి కృషి చేశామన్నారు. వందల ఏలనాటి అగస్తీశ్వర స్వామి కొండకు తారు రెడ్డు వేసిన ఘనత తమకు దక్కిందన్నారు అమరావతి రహదారులతోపాటు పుంగనూరు నియోజకవర్గంలోని రొంపిచర్ల క్రాస్ వరకు వెళ్లే రోడ్డు విషయమై పుంగనూరు తెలుగుదేశం పార్టీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసి రోడ్డును ఏర్పాటు చేసేలా కృషి చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితుల వల్ల చౌడేపల్లి మండలంలో త్రాగునీటి సమస్య అనేక గ్రామాల్లో నెలకొని ఉన్నాయని వాటర్ గ్రిడ్ పథకం ద్వారా అన్ని గ్రామాలకు మంచినీటి వసతి కల్పించాలని సూచించారు ఇప్పటికే పుంగనూరు నియోజకవర్గంలో వాటర్ గ్రిడ్ ఏర్పాటుకు టెండర్లు పూర్తి అయ్యాయని సర్వే సైతం అయింది అన్నారు ఇక పనులు చేయడమే తరువాయి అన్నారు కేంద్ర ప్రభుత్వ వాటా 50 శాతం నిధులు సమకూర్చాలని తగ్గిన 50 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తీసుకొచ్చి వాటర్ గ్రిడ్ పనులు పూర్తి చేయాలని తెలుగుదేశం పార్టీ నాయకులకు ఆయన సూచించారు. పుంగనూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తే సంతోషిస్తామన్నారు అందుకు తాము సైతం సహకరిస్తామన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తమ కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ ప్రజలు కార్యకర్తలకు అండగా ఉంటా మని సమస్యలు పరిష్కార దిశగా అడుగులు వేస్తామని ఈ సందర్భంగా ఆయన అన్నారు అనంతరం ప్రజలు కార్యకర్తల విన్నధులను స్వీకరి ంచారు ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి జెడ్పిటిసి దామోదర్ రాజు ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి నరసింహులు యాదవ్ మాజీ ఎంపీపీలు కూరపర్తి అంజిబాబు రెడ్డి ప్రకాష్ రుక్మిణమ్మ చిత్తూరు రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గం యువజన అధ్యక్షుడు మిద్దింటి కిషోర్ బాబు ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ మాజీ అధ్యక్షుడు కళ్యాణ్ భరత్ బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ మాజీ సభ్యుడు పవన్ రాయల్ వైకాపా సేవాదళ్ జిల్లా నాయకుడు హరీష్ రాయల్ చౌడేపల్లి సర్పంచ్ శ్రీరాం భరత్ వరుణ్ శ్రీనివాసులు రెడ్డి తొం డా శ్రీరాములు అల్తాఫ్ భాషా మండలంలోని పలువురు సర్పం చులు ఎంపీటీసీ సభ్యులు వైకాపా నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం బోర్డులను ఏర్పాటు చేసిన అధికారులు

విశాలాంధ్ర-దొరవారిసత్రం: ప్రభుత్వ కార్యాలయాల్లో కనబడని సమచారహక్కు చట్టం బోర్డులు-అధికారులు పేర్లు, హొదా, చిరునామ, ఫోన్ నెంబర్లును కనపడడం లేదనే వార్త సొమవారం విశాలాంధ్ర జాతీయ దినపత్రికలలో ప్రచురితం అయింది. ఈ వార్తకు స్పందించిన దొరవారిసత్రం మండల తహశీల్ధారు, ఎంపీడీవో, ఎంఈవో, వ్యవసాయ కార్యాలయం, హౌసింగ్, విద్యుత్ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శాఖ అధికారులు తాత్కాలికంగా సమాచారం బోర్డ్‌లను ఏర్పాటు చేశారు. ఈ తాత్కలికంగా సమాచార హక్కు చట్టం 2005 బోర్డ్‌లో పౌర సమాచార అధికారి, పౌర సమాచార సహాయ అధికారి,అప్పీలు స్వీకరించే అధికారుల పేర్లు, హొదా, చిరునామ, ఫోన్ నెంబర్లును ఏర్పాటు చేశారు.

సామాన్య రైతులను శాస్త్రవేత్తలను చేయడం అమోఘం: మెక్సికో బృందం

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో విత్తనం వేసిన మెక్సికో బృందం

విశాలాంధ్ర - రామచంద్రాపురం : ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఆంధ్ర ప్రదేశ్ లో అమలవు తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమం అనేక సవాళ్ళకు సమాధానం చూపగలవని మెక్సికో ప్రతినిధి బృందం కు నేతృత్వం వహిస్తున్న మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా స్పష్టం చేశారు. తిరుపతి జిల్లాలో చేస్తున్న తమ మూడు రోజుల పర్యటనలో భాగంగా మూడవ రోజు మంగళవారం రామచంద్రాపురం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో స్థానిక రైతు సి. నాగరాజు వ్యవసాయ క్షేత్రంలో స్వయంగా విత్తనాలు వేసి ఎటీఎం, ఏ గ్రేడ్, డ్రాట్ ప్రూఫింగ్ మోడళ్లను వేసే ప్రక్రియలో పాలుపంచుకొన్నారు. ఏపీసీఎన్ఎఫ్ ప్రోటోకాల్స్ అనుసరించి పొలం సరిహద్దులలో పంట సంరక్షణ కోసం జొన్న, మొక్కజొన్న, సజ్జ విత్తనాలు వేశారు. ప్రకృతి వ్యవసాయ పరిజ్ఞానాన్ని, అందులో దాగిఉన్న సైన్స్ ను పూర్తిగా అర్ధం చేసుకొనేందుకు ఈ రోజు ప్రత్యక్షంగా ప్రకృతి వ్యవసాయ ఆదర్శ నమూనాలను వేయడంతో పాటు నేలకు ఘన జీవామృతం అందించి బీజామృతంతో విత్తన శుద్ధి చేసే ప్రక్రియ లో కూడా పాలు పంచుకొన్నారు. గొల్లపల్లి గ్రామానికి చెందిన నాగరాజు 2017 వ సంవత్సరం నుంచి తనకున్న 2.5 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసరిస్తున్నాడు.అనంతరం మెక్సికో బృందం కొత్త కండ్రిగ పంచాయతీ పరిధిలోని టీవీ సపార్లు గ్రామంలో ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది మరియు రైతు సాధికార సంస్థ (ఆర్ వై ఎస్ ఎస్) ఆరోగ్య పోషణ విభాగానికి చెందిన ఇంటర్న్ లతో మాట్లాడి ప్రకృతి వ్యవసాయ అమలు విధానాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా మరియా మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్ ద్వారా ప్రజలు ముఖ్యంగా మహిళలు ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడం ఎంతగానో ఆకట్టుకొందని అన్నారు. రాష్ట్రంలో సామాన్య రైతులను శాస్త్రవేత్తలుగా తయారు చేసే విధానం అమోఘం అని కితాబు నిచ్చారు. ఆరోగ్య విభాగపు సిబ్బందితో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ కార్యక్రమంలో హెల్త్ అండ్ న్యూట్రీషన్ విభాగం పాత్రపై అనేక సందేహాలను నివృత్తి చేసుకొన్నారు .ఆర్ వై ఎస్ ఎస్ ఆరోగ్య విభాగపు థి మాటిక్ లీడ్ డాక్టర్ రాజగోపాల్ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం వల్ల ఆరోగ్యంలో వచ్చే మార్పులను ఉదాహర ణలతో వివరించారు.బృంద సభ్యులు కుప్పం బాదూరు గ్రామంలో పర్యటించి సూర్యమండలం నమూనా లో తక్కువ విస్తీర్ణంలో వివిధ రకాల ఆకుకూరలు, కాయగూరలను పండించే పద్ధతులను తెలుసుకొ న్నారు. మోడల్ ను సందర్శించారు రైతు సాధికార సంస్థ ద్వారా అమల వుతున్న ఆరోగ్యం పోషణ కార్యక్రమా లను, ఫుడ్ బాస్కెట్ ఫలితాలను లబ్దిదారులను అడిగి తెలుసుకొ న్నారు.ఈ కార్యక్రమంలో రైతు సాధికార సంస్థ సీనియర్ అధికారులు చక్రాల చంద్రశేఖర, కె.సురేష్ బాబు, స్మితా జాకోబ్, డాక్టర్ రాజగో పాల్, ఏపీసీఎన్ఎఫ్ తిరుపతి జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం, అదనపు మేనేజర్ పట్టాభి రెడ్డి, సీనియర్ కన్సల్టెంట్ సురేంద్ర రెడ్డి, ప్రాంతీయ టెక్నికల్ ఆఫీసర్ ఆరి రవి చంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మోదీజీ పాలనా దక్షత వల్లే ...

భారత్ అన్ని రంగాలలో రాణిస్తోంది

- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాద్ రావు

విశాలాంధ్ర- చిత్తూరు : ప్రపంచం మెచ్చిన నేత దేశ ప్రధాని నరేంద్ర మోడీజిని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోడీజీ పుట్టినరోజు వేడుకలను చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. చిత్తూరు జిల్లా భారతీయ జనతా పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన మోదీజీ జన్మదిన వేడుకలకు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీజీ సమర్థ నాయకత్వం వల్లే భారతావని అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందని తెలిపారు. పేదల సంక్షేమం కోసం నిరంతరం ఓ శ్రామికుడిలా ఆయన పనిచేయడం స్ఫూర్తిదాయకమన్నారు. దేశంలోని అన్ని సామాజిక వర్గాల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని సంక్షేమ పథకాలను అమలుపరిచి, వారికి చేరువ చేయడం నరేంద్ర మోదీ పాలనాధ్యక్షతకు నిదర్శనమన్నారు. ఆయన తీసుకొచ్చిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రపంచ దేశాలచే ప్రశంసలందుకుంటున్నాయని మోడీజీ సుపరిపాలనను కొనియాడారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రధాని నరేంద్ర మోడీని ఆదర్శ ంగా తీసుకొని తమ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ హేమలత, ఎక్స్ ఎమ్మెల్సీ దొరబాబు, బిజెపి నాయకులు సామంచి శ్రీనివాసులు, చిట్టిబాబు , ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తండ్రి చెన్నకేశవ నాయుడు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, ఇతర వక్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలు

పేదలకు అన్న దానం : కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్

విశాలాంధ్ర - తిరుపతి : స్థానిక గాంధీ రోడ్డు లోని కస్తూరిబా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయము నందు భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ 74వ జన్మదిన వేడుకలో 500 మంది పేదలకు అన్న దానం ను ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పి.సి.రాయులు అధ్యక్షతన అత్యంత ఘనంగా నిర్వహించారు . మొదటిగా కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం వెయ్యి మంది పేదలకు ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమము చేయడం జరిగినది. ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా బి.జే. పీ. జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యకులు శ్రీ సన్నపురెడ్డి సురేష్ రెడ్డి , అలాగే రాష్ట్ర బిజెపి నాయకులు భాను ప్రకాష్ రెడ్డి , బిజేపి నాయకులు అజయ్ కుమార్ , బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుబాల చంద్రశేఖర్ , బిజేపీ నాయకులు జల్లి మధుసూదన్ , ప్రశాంత్ రాజు మరియు తుపాటి కిషోర్ తదితరులు హాజరైనారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మాట్లాడుతూ గత 20 సంవత్సరములుగా ఈ ట్రస్టు ద్వారా కార్యక్రమాలు అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని ముఖ్యంగా బడుగు బల బలహీన వర్గాల మహిళల విద్యార్థులకు అనేక సేవా కార్యక్రమాలు కోట్లు వెచ్చిస్తూ చేస్తున్నామని భవిష్యత్తులో ఈ ట్రస్ట్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తామని తెలియజేస్తూ మంగళవారం కస్తూరిబా గాంధీ ట్రస్ట్ ప్రధానమంత్రి 74వ జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా జరుపుకోవడం చాలా సంతోషకరమని చాలా సంతోషకరమని అగ్రరాజ్యాలతో పోటీపడి భారతదేశాన్ని దేశ ప్రధాని ప్రగతి పతము లో నడిపిస్తున్నారని ఈ సందర్భంగా తెలియజేస్తూ తెలియజేశారు అటు ముఖ్యమంత్రి గా ఇటు దేశ ప్రధానిగా మంచి పరిపాలన అధ్యక్షులుగా ప్రజలకు పరిపాలన అందిస్తున్నారని ఈ సందర్భంగా దేశ ప్రధాని సేవలను డాక్టర్ పి సి రాయలు ను కొనియాడారు. బిజెపి రాష్ట్ర నాయకులు భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ భావజాలాల వల్ల చిన్న స్థాయి నుంచి చిన్న స్థాయి. నుంచి ముఖ్యమంత్రిగా ఇటు దేశ ప్రధానిగా అద్భుతమైన పరిపాలన అందిస్తూ దేశాన్ని సురక్షితంగా నడిపిస్తూ అంకిత భావంతో పనిచేస్తున్నారని ఎలాంటి అవినీతి ఆరోపణ లేకుండా చక్కగా పరిపాలి స్తు న్నారని ఎంతోమంది యువతకు ఆదర్శప్రాయాలుగా ఉన్నారని ఈరోజు దేశవ్యాప్తంగా జన్మదిన వేడుకలు ఎంతో వైభవంగా నిర్వహిస్తు న్నారని నిర్వహిస్తు న్నారని తెలియజేశారు. జాతీయ బి. జే.పీ. కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు సున్నపురెడ్డి సురేష్ రెడ్డి మాట్లాడుతూ అగ్రరాజ్యాల సరసన మన దేశం నిలబడిందని ఆగరాజ్యాల్లోని మన భారతదేశాన్ని మూడవ అగ్రస్థానంలో నిలిపిన గొప్ప నాయకుడు మన భారతదేశ ప్రధానమంత్రిని అగ్ర దేశాలలో మన ప్రధానమంత్రిని ప్రశంసించారని అలాగే గత 20 సంవత్సరాలుగా కస్తూర్బా గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరంతరం చేస్తున్న ట్రస్ట్ సేవా కార్యక్రమాలను ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పిసి రాయులు ని వారి సేవలను కొనియాడారు. తదనంతరము వెయ్యి మందికి స్థానిక పేద ప్రజలకు అన్నదానం వితరణ చేసినారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపీ నాయకులు మరియు బండి మధుసూదన్ రెడ్డి , ఉదయగిరి కృష్ణమూర్తి సుబ్రహ్మణ్యం రెడ్డి , ఉమా , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.